

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తిరుపతి రూరల్: నగరంలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎస్పీడీసీఎల్ తిరుపతి డివిజన్ ఈఈ వాసుదేవరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రైల్వే కాలనీ, సుందరయ్యనగర్, భవానీనగర్, యశోదనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక అందజేత



పెళ్లి కానుకను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాకాల: మండలంలోని ఇరంగారిపల్లె పంచాయతీ పాలిసేనివారిపల్లె గ్రామంలో పెళ్లి చేసుకోనున్న జంటకు చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లి కానుకను మంగళవారం అందజేశారు. అందులో బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, పట్టు బట్టలు, గ్రీటింగ్ కార్డు ఉన్నాయి. నేంద్రగుంట డివిజన్ అధ్యక్షుడు గుండ్లూరి సురేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ మునీర్, నంద, కలాం, జాభీర్, సుజాత, రాజశేఖర్‌రెడ్డి, శివ, రఫీ, రెహ్మాన్, షఫీ పాల్గొన్నారు.

శస్త్రచికిత్సతో గోవుకు పునర్జీవం

- వైద్య బృందానికి అభినందనలు



శస్త్ర చికిత్స అనంతరం కోలుకున్న ఆవు

సాక్షి, తిరుపతి: కలకడ మండలానికి చెందిన మూడున్నరేళ్ల ఆవు రెండు రోజుల క్రితం దూడకు జన్మనిచ్చింది. ఆవు పైకి లేస్తున్న సమయంలో కాలు జారడం వల్ల కాలి గిట్టకి బదులు మోకాలి పైనే ఉండిపోయింది. దీని వల్ల వేరొక వెనుక కాలు కూడా దెబ్బతిని కొంచెం దూరం మాత్రమే కదలగలిగింది. స్థానిక పశువైద్యులు ఇచ్చిన చికిత్సకు స్పందన లేకపోవడంతో 15 రోజుల పాటు నరకం అనుభవించింది. వారు ఆవును తిరుపతి పశువైద్య కళాశాలకు పంపించారు. ఆవును పరీక్షించిన తరువాత తొడ ప్రాంతంలో గ్యాస్ట్రోనీమియస్ కండరం లోపలి భాగం పూర్తిగా చీలిపోయినట్లు నిర్ధారించారు. ప్రొఫెసర్ ఎం. రఘునాథ్ నేతృత్వంలోని సర్జన్ల బృందం ఎస్. భారతి, జి.వాణి, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులతో కలిసి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు. ట్రాన్స్ ఆర్టిక్యులర్ ట్రాన్స్‌ఫిక్సేషన్ అనే ఈ అరుదైన శస్త్రచికిత్స హాక్ జాయింట్‌ను సాధారణ స్థితిలో ఉంచడానికి, కండరాల చీలిక నయం అయ్యే వరకు సహాయపడుతుంది. శస్త్రచికిత్స జరిగిన 3 గంటల తర్వాత ఆవు శస్త్రచికిత్స జరిగిన కాలిపై సాధారణ బరువు పెట్టడం ప్రారంభించింది. తరువాత మూడో రోజున ఆవును డిశ్చార్జ్ చేశారు. మూడు నెలల తర్వాత ట్రాన్స్‌ఫిక్సేషన్ అమరిక తొలగించారు. ఆవు సాధారణంగా నడవడం కొనసాగించింది. ఇలాంటి కేసుల్లో పశువులకు కారుణ్య మరణం లేదా వధకు సలహా ఇవ్వడం జరిగేదని ప్రొఫెసర్, హెడ్ డాక్టర్ ఎస్. ధనలక్ష్మి వివరించారు. ఆవుకు నూతన జీవితాన్ని అందించిన వైద్య బృందాన్ని కళాశాల అసోసియేట్ డీన్ కె.ఆదిలక్ష్మమ్మ అభినందించారు.

అన్నమయ్య సంకీర్తనల్లో వేదాంత విషయాలు



సమావేశంలో మాట్లాడుతున్న రఘునాథ శర్మ

తిరుపతి కల్చరల్: అన్నమయ్య రచించిన సంకీర్తనల్లో వేదాంత విషయాలు దాగి ఉన్నాయని రాజమండ్రికి చెందిన ప్రముఖ పండితుడు ఆచార్య శలాక రఘునాథ శర్మ అన్నారు. అన్నమాచార్య కళామందిరంలో నిర్వహిస్తున్న తాళ్లపాక అన్నమాచార్యుల 615వ జయంతి ఉత్సవాలు మంగళవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. రఘునాథ శర్మ అన్నమయ్య వేదాంతం అనే అంశంపై ప్రసంగించారు. అన్నమయ్య ప్రధానంగా భక్తి, శృంగార, ఆధ్యాత్మిక సంకీర్తనలు రచించారని, ఈ మూడింటిలోనూ భక్తి ప్రధానంగా కనిపిస్తోందన్నారు. అనంతరం జాతీయ సంస్కృత వర్సిటీ అతిథి అధ్యాపకుడు ఆర్.వెంకటాచార్యులు అన్నమయ్య సాహిత్య దృష్టి అనే అంశంపై ప్రసంగించారు. అన్నమయ్య సాహిత్యానికి ప్రత్యేక శైలి ఉందని, సంకీర్తనల్లో ఆర్ష విజ్ఞానాన్ని పొందుపరిచారని తెలిపారు. జీకే.సుందరం అన్నమయ్య సాహిత్యం–అలమేలు మంగ అనే అంశంపై ఉపన్యసిస్తూ అన్నమయ్య తన కీర్తనల్లో శ్రీవారి తర్వాత అలమేలు మంగమ్మకు సముచిత స్థానం కల్పించారని తెలిపారు. తిరుపతికి చెందిన ఆర్.సుశీల బృందం ఆలపించిన సంకీర్తనలు, కె.చంద్రశేఖర్ బృందం ప్రదర్శించిన హరికథాగానం భక్తులకు ఆకట్టుకుంది.

పాకాల గంగజాతరకు చాటింపు



చాటింపు వేస్తున్న గ్రామస్తులు

పాకాల: గంగ జాతరను పురస్కరించుకుని పాకాలలో సోమవారం చాటింపు చేశారు. ఈ నెల 16వ తేదీ స్థానిక సత్యమ్మ ఆలయం వద్ద గంగమ్మ ప్రతిమను ఏర్పాటు చేయనున్నారు. పొంగళ్లు సమర్పించనున్నారు. 17వ తేదీ ప్రత్యేక పూజల అనంతరం సాయంత్రం అమ్మవారి ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

న్యాయమూర్తికి ఘన సన్మానం



జడ్జి వీర్రాజును సన్మానిస్తున్న కోర్టు సిబ్బంది

తిరుపతి లీగల్ : తిరుపతి 3వ అదనపు జిల్లా జడ్జిగా విధులు నిర్వహించి టీటీడీ లా ఆఫీసర్‌గా డిప్యూటేషన్‌పై వెళుతున్న జడ్జి వై.వీర్రాజును కోర్టు సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జడ్జి వీర్రాజు మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా విధి నిర్వహణలో తనకు సహకరించిన కోర్టు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ కోర్టు సెషన్స్ జడ్జి నాగరాజు, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు, ప్రోటోకాల్ అధికారి ధనంజయనాయుడు, నాజర్ శరవణ పాల్గొన్నారు.

ఎర్ర దుంగలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న దుంగలతో అటవీ అధికారులు

భాకరాపేట: అడవిలో డంప్ చేసిన ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్టు సెక్షన్ అధికారి సల్లావుద్దీన్ తెలిపారు. మంగళవారం తలకోన నార్త్ బీట్ పరిధిలో కూంబింగ్ నిర్వహించామన్నారు. పొట్టేలు కురువ ప్రదేశంలో దాచిన 8 ఎర్ర దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. 239 కేజీల బరువు గల దుంగల విలువ రూ.6 లక్షలు ఉంటుందన్నారు.

కాలభైరవునికి అభిషేక పూజలు

రేణిగుంట: శ్రీకాళహస్తి ఆలయంలో బుధవారం రాత్రి ఆలయ పండితులు కాలభైరవునికి అభిషేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదమంత్రాలను పఠిస్తూ చందనం, కుంకుమ అభిషేకాలను నిర్వహించి కర్పూర హారతులు సమర్పించారు. భక్తులు అభిషేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించారు.

భూ సేకరణ వేగవంతం చేయాలి

గూడూరు: సాగరమాల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణను వేగవంతం చేయాలని ఆర్డీఓ కిరణ్‌కుమార్ తహసీల్దార్లను ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఆయన తహసీల్దార్లు, ఆర్ఐలు, వీఆర్‌ఓలు, సర్వేయర్లతో సమావేశమై పలు సూచనలు చేశారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో సముద్ర జీవులకు ముప్పు

చిల్లకూరు: పర్యాటకులు వదలి వెళ్లే ప్లాస్టిక్ వ్యర్థాలతో సముద్ర జీవరాశులకు పెను ప్రమాదం ఉంటుందని, వాటిని కాపాడుకునేందుకు పర్యాటకులు సహకారం ఇవ్వాలని అటవీ అధికారులు కోరారు. మంగళవారం గమ్మళ్లదిబ్బ నుంచి తీగపాళెం వరకు ఉన్న తీర ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేత కార్యక్రమం నిర్వహించారు. స్థానికులకు అవగాహన కల్పించారు. తమ్మినపట్నం అటవీ సెక్షన్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ, సముద్రంలో జీవించే పలు రకాల జీవరాశులు ప్లాస్టిక్ వ్యర్థాలను ఆహారంగా తీసుకోవడంతో మృతి చెందుతున్నాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్లాస్టిక్ వాడకానికి ప్రతి ఒక్కరూ స్వస్తి పలకాలని విజ్ఞప్తి చేశారు.